క్లుప్తంగా

భార్య మృతికి కారణమైన భర్తపై కేసు

సారంగాపూర్: భార్య మృతికి కారణమైన భర్తపై కేసు నమోదైంది. ఎస్సై కుమారస్వామి కథనం ప్రకారం.. బీర్పూర్ గ్రామానికి చెందిన గుండ భూమక్క–లింగన్న దంపతుల రెండో కూతురు పుష్ప(40)ను సారంగాపూర్ మండలం బట్టపల్లి గ్రామానికి చెందిన బత్తిని శ్రీనివాస్ రెండో పెళ్లి చేసుకున్నాడు. శ్రీనివాస్ మొదటి భార్యకు పుట్టిన కొడుకు ఉన్నాడు. అయితే, రెండో భార్య పుష్పకు తల్లిదండ్రులు బీర్పూర్‌లో ఓ ఇంటిని ఇచ్చారు. ఆ ఇంటిని తన మొదటి భార్య కొడుకు పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలని పలుమార్లు శ్రీనివాస్, పుష్ప మధ్య గొడవలు జరిగాయి. గతంలో బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనా శ్రీనివాస్‌లో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో ఈనెల 13న పుష్పపై శ్రీనివాస్ ఇష్టం వచ్చినట్లు దాడి చేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లగా, జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. తర్వాత ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన ఎస్సై రాజు

మల్లాపూర్: మల్లాపూర్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కొనస రాజుకు పోస్టింగ్ ఇస్తూ జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు విడుదల చేయగా.. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. మల్లాపూర్ ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తించిన కిరణ్‌కుమార్ బదిలీపై మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. 2024, ఫిబ్రవరి 9న బదిలీపై వచ్చిన కిరణ్‌కుమార్ 10 నెలల పదవీకాలం పూర్తి చేసుకొని బదిలీపై మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా.. అదే పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధుల్లో ఉన్న రాజు బదిలీపై వచ్చి మల్లాపూర్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు.
మెట్‌పల్లి: మెట్‌పల్లి ఎస్ఐగా కిరణ్‌కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా ఉన్న చిరంజీవిని ఉన్నతాధికారులు నిజామాబాద్ జిల్లా నందిపేటకు బదిలీ చేసి ఆయన స్థానంలో మల్లాపూర్ ఎస్ఐగా ఉన్న కిరణ్‌కుమార్‌ను నియమించారు.

దుప్పట్లు పంపిణీ

కోరుట్ల: కాంగ్రెస్ నాయకుడు, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి జన్మదినం పురస్కరించుకొని కోరుట్లలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కొంతం రాజం, తిరుమల గంగాధర్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నివాసం ఇందిరాభవన్‌లో ఆదివారం మధుయాష్కిగౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కేక్ కట్ చేశారు. కొత్త మోహన్, తాటిపర్తి విజయలక్ష్మి, గాజంగి నందయ్య, కళ్లెపెల్లి దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


శ్యామ్‌ను సన్మానిస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీయల్ జిల్లా కోఆర్డినేటర్‌గా ఎన్నికైన నల్ల శ్యామ్‌ను ఆదివారం లక్ష్మీపూర్ గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. భూపెల్లి రాజేశ్, చెరుకు జాన్, గంగన్న, శేఖర్ హాబిబ్, బాలయ్య, రమేశ్, బుచ్చన్న, భాస్కర్, స్వామి, నాగరాజు, హన్మంతు పాల్గొన్నారు.
కథలాపూర్: గంభీర్‌పూర్ గ్రామంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ పులి శిరీషను ఆదివారం శాలువాలతో సన్మానించారు. రాచర్ల లక్ష్మీపతి, చిలివేరి రాజేశం, పోతు శేఖర్, మనోహర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య కమిటీలు ఏర్పాటు చేయాలి

రాయికల్: ప్రభుత్వ పాఠశాలలో యాజమాన్య కమిటీలు ఏర్పాటు చేసి బలోపేతానికి కృషి చేయాలని భూపతిపూర్ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త మోతె అంజయ్య ఆదివారం సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం పంపించారు.

జైనాలో ఉచిత వైద్యశిబిరం

ధర్మపురి: జైనా గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన వన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక మాజీ ఉప సర్పంచ్ కోరుట్ల శ్రీనివాస్ సహకారంతో వివిధ విభాగాల వైద్యులు పలువురు రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వన్ హాస్పిటల్ వైద్యబృందం, స్థానిక నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పని చేయని సీసీ కెమెరాలు

- పట్టించుకోని పోలీసు, మున్సిపల్ అధికారులు


రాయికల్‌లో సీసీ కెమెరా పని చేయక దుకాణంలో పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)

రాయికల్: రాయికల్ మున్సిపల్‌లో దొంగతనాల నియంత్రణ, పోకిరీల బెడదను అరికట్టేందుకు పట్టణంలో ప్రధాన కూడళ్ల వద్ద రూ.20 లక్షల వ్యయంతో 25 కెమెరాలను ఏర్పాటు చేశారు. సంవత్సరాల కాలం నుంచి సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో రాత్రులు, ఉదయం పూట యువకులు గంజాయి మత్తులో వేగంగా వాహనాలు నడుపుతున్నారు. పోకిరీల బెడద తీవ్రతరం కావడంతోపాటు వాహనాల దొంగలు ఎక్కువ కావడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

పని చేయని నిఘా నేత్రాలు

రాయికల్‌లో దొంగతనాల నియంత్రణ కోసం టీయూఎఫ్ఐడీసీ నిధుల ద్వారా రూ.20లక్షలు మంజూరు కాగా.. నిజామాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు మున్సిపల్ అధికారులు సీసీ కెమెరాల ఏర్పాటు కోసం అప్పగించారు. పట్టణంలో 12 వార్డులు ఉండగా.. దొంగతనాల నియంత్రణ కోసం మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీచౌక్, ఇటిక్యాల క్రాసింగ్ రోడ్, పాత బస్టాండ్, ప్రభుత్వ పాఠశాలలు, శివాజీచౌక్ వంటి ప్రధాన ఏరియాల్లో 25 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటి పర్యవేక్షణకు పోలీసులకు అప్పగించారు. కానీ పోలీసులు సీసీ కెమెరాల పర్యవేక్షణలో విఫలమయ్యారు. సీసీ కెమెరాలకు సంబంధించి కంట్రోల్ కేంద్రం రాయికల్ ఠాణాలో ఏర్పాటు చేయగా.. గత సీసీ కెమెరాలు సరిగా పని చేయకపోవడంతో పట్టణంలో ఏ ప్రమాదం జరిగినా నియంత్రించలేకపోతున్నామని పోలీసులు సైతం తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాయికల్‌లో నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు పని చేసేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సీసీ కెమెరాల బాధ్యత పోలీసులకు అప్పగించాం



బల్దియాలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో 25 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షణ బాధ్యత పోలీసులకు అప్పగించాం. బల్దియాలో ఏర్పాటు చేసిన కెమెరాలు పని చేయడం లేదన్న విషయం మా దృష్టికి సైతం వచ్చింది. – జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్

కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొస్తాం



రాయికల్ బల్దియాలో సీసీ కెమెరాల టెండర్ దక్కించుకొని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తాం. పట్టణ ప్రజలు సహకరించాలి. – సుధీర్‌రావు, ఎస్సై


ఇబ్రహీంపట్నం: బోనాలతో మహిళలు


మెట్లచిట్టాపూర్‌లో..

మల్లన్న బోనాలు

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మల్లన్న బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనం ఎత్తుకొని గ్రామ శివారులోని దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.
డబ్బా, అమ్మక్కపేట గ్రామాల్లో ఆదివారం మల్లన్న జాతర యాదవ సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు మల్లన్నకు మొక్కులు చెల్లించుకున్నారు.
మెట్‌పల్లిరూరల్: మెట్లచిట్టాపూర్‌లో మల్లన్నస్వామి జాతర వైభవంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి స్వామి వారికి సమర్పించారు.

మణికంఠుడికి మహాభిషేకం


ధర్మపురిలో అభిషేకం చేస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: పట్టణంలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు పెండాల బాలకృష్ణశర్మ, రాజేశ్‌శర్మ మంత్రోచ్చరణలతో అభిషేకం చేశారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భిక్ష నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు భీమనాతి మంగ అశోక్, స్వాములు తదితరులు పాల్గొన్నారు.
వెల్గటూర్: మండల కేంద్రంలోని శ్రీరామ భక్తాంజనేయ ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పెంద్యాల బాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అయ్యప్ప నామ సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.
కోరుట్ల: పట్టణంలోని జువ్వాడి భవన్‌లో కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ సెగ్మెంట్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, శ్రీనివాస్, బ్రహ్మన్నగారి శంకర్‌శర్మ, రవిగౌడ్, తోట రాజు, సత్యారావు పాల్గొన్నారు.

నేటితరం మహిళలకు ఐలమ్మ స్ఫూర్తి


చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొండగట్టు: నేటితరం మహిళలకు చాకలి ఐలమ్మ స్ఫూర్తిదాయకంగా నిలిచిందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఆదివారం కొడిమ్యాల మండల కేంద్రంలోని అంగడిబజార్ ప్రాంతంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. తిర్మలపూర్ గ్రామంలో రూ.20లక్షల నిధులతో నిర్మించనున్న పల్లె దవాఖానకు శంకుస్థాపన చేశారు. చొప్పదండి ఏఎంసీ చైర్మన్ మహేశ్, రవీందర్‌రెడ్డి, నారాయణగౌడ్, ముత్యం శంకర్, ప్రభాకర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, మ్యాకల మల్లేశం, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలి



ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

జగిత్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో నిర్వహిస్తున్న అన్ని రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ పాఠశాలలకు ఒకే డైట్, ఒకే మెనూ అమలు చేయాలని, అన్ని ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలని స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులందరినీ తారతమ్యం లేకుండా ఒకేలా పరిగణించాలన్నారు.

నిరుపేదలకు వరం.. సీఎం రిలీఫ్ ఫండ్


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కన్నాపూర్ గ్రామానికి చెందిన నాగరాజుకు మంజూరైన రూ.10వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ చేశారు.

ఐదెకరాల్లో క్రీడామైదానం


మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల: కోరుట్లలో క్రికెట్ కోసం ప్రత్యేకంగా ఐదెకరాల్లో క్రీడామైదానం ఏర్పాటు చేయిస్తామని కోరుట్ల సెగ్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఆదివారం కోరుట్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన క్రీడాకారుల వేలంపాట ప్రారంభించారు. మా నాన్న మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు స్మారకార్థం కేపీఎల్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. కోరుట్ల క్రికెట్ అసోషియేషన్‌కు హెచ్‌సీఏ నుంచి గుర్తింపు వచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడతామని అన్నారు. కోరుట్ల ప్రీమియర్ లీగ్‌ను నియోజకవర్గ స్థాయిలో నిర్వహించాలని నిర్వాహకులు మోయిజ్, బాల్‌రాజ్‌లకు సూచించారు. 12 టీంలకు చెందిన ప్రాంచైజీలు, కాంగ్రెస్ నాయకులు అన్నం అనిల్, తిరమల గంగాధర్, కోరుట్ల, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్లు అంజిరెడ్డి, రాజు, జిందం లక్ష్మీనారాయణ, టోర్నీ నిర్వాహక కమిటీ సభ్యులు షబ్బీర్, అబుబకర్, అస్లాం, కేసీఏ లీగల్ అడ్వైజర్ బోయిని సత్యం, గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి


ధ్రువపత్రాలు అందిస్తున్న బీజేపీ నాయకులు

కథలాపూర్: గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల మారుతి కోరారు. ఆదివారం తక్కళ్లపెల్లి, చింతకుంట, రాజారాంతండా గ్రామాల్లో బీజేపీ బూత్ స్థాయి కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ధ్రువపత్రాలు అందించి శాలువాలతో సన్మానించారు. బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు, గాంధారి శ్రీనివాస్, జిల్లా సత్యం, మిట్టపెల్లి ప్రకాశ్, కాసోజి ప్రతాప్, కోరుట్ల రాజేశ్, అన్నం మహేశ్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు


ముస్తాబవుతున్న వేణుగోపాలస్వామి ఆలయం

జగిత్యాలటౌన్: ఆధ్యాత్మిక మాసంగా భావించే పవిత్ర ధనుర్మాసోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. జనవరి 14 వరకు 30 రోజులపాటు సాగనున్నాయి. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతోపాటు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు.

నృసింహస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ



వెల్గటూర్: కిషన్‌రావుపేట లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకొని గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులంతా కలిసి స్వామివారి నామ సంకీర్తనలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయంలోని ధ్రువమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుర్గాదేవి ఆలయ ద్వారం ప్రతిష్ఠాపనోత్సవాలు

కథలాపూర్: భూషణరావుపేటలో దుర్గాదేవి ఆలయం ప్రవేశ ద్వారం ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా గ్రామం నుంచి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రవేశ ద్వారం ప్రతిష్ఠించి పూజలు చేశారు.



మేడం.. ఫొటో ప్లీజ్..

సారంగాపూర్: సారంగాపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ఆదివారం ఎమ్మెల్సీ కవిత సందర్శించి విద్యార్థుల సమస్యలనడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లోకి వెళ్లి చదువు ఎలా చెబుతున్నారు.. భోజనం ఎలా ఉందని అడిగారు. చాలా బాగుందని సమాధానమిచ్చారు. వంట చేసే సిబ్బంది వద్దకెళ్లి భోజనం ఎలా వండుతున్నారని ప్రశ్నించారు. వంట సామగ్రి పరిశీలించారు. విద్యార్థులు ఎమ్మెల్సీతో కరచాలనం చేసేందుకు ఇష్టపడ్డారు. జైతెలంగాణ అంటూ విద్యార్థులంతా నినదించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బందితో కలిసి ఫొటో దిగారు.
జగిత్యాలటౌన్: ఇటీవల మృతిచెందిన తెలంగాణ ఉద్యమకారుడు చేని నగేశ్ కుటుంబాన్ని ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు.
రాయికల్: రాయికల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ ఎనుగందుల ఉదయశ్రీ భర్త లింగంగౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా.. ఆదివారం కల్వకుంట్ల కవిత పరామర్శించారు. సంధ్యారాణి, మల్లేశ్‌యాదవ్, ఎలిగేటి అనిల్ తదితరులు పాల్గొన్నారు.
మేడిపల్లి: మండలానికి విచ్చేసిన కవితకు పోరుమల్ల, గుండ్లపల్లి నాయకులు స్వాగతం పలికారు. పోరుమల్లలో రైతులతో ముచ్చటించారు. మేడిపల్లి మండల కేంద్రంలో కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన వేణుగోపాల్‌రావు కుటుంబీకులను పరామర్శించారు.

దొంగలను పట్టుకోవాలి


ఈశ్వరయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ

సారంగాపూర్: దొంగలను పట్టుకొని బాధిత కుటుంబానికి నష్టాన్ని రికవరీ చేయాలని ఆదివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పోలీస్ అధికారులను కోరారు. బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన ఈశ్వరయ్య, ఆయన భార్యను కొట్టి బంగారం, వెండి, నగదును దొంగలు అపహరించగా.. వారిని ఎమ్మెల్సీ బీర్‌పూర్‌లో పరామర్శించారు. విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్, మాజీ వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, చెర్పూరి సుభాష్, గుడిసె జితేందర్ ఉన్నారు.

వల్లభాయ్ పటేల్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న నాయకులు

కథలాపూర్: సిరికొండ గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని బీజేపీ నాయకులు ఆదివారం నిర్వహించారు. వెంకటేశ్వర్‌రావు, మల్యాల మారుతి, గాంధారి శ్రీనివాస్, ప్రతాప్, అశోక్‌గౌడ్, రాజేందర్, రాకేశ్, రాజు పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలంపియాడ్‌కు స్పందన


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

జగిత్యాలటౌన్: పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీలో నిర్వహించిన జ్యోతి మ్యాథమేటిక్ ఒలంపియాడ్ 2024కు అపూర్వ స్పందన లభించిందని పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరిచరణ్‌రావు అన్నారు. డిసెంబర్ 22న శ్రీనివాస రామానుజన్ జయంతి(గణిత దినోత్సవం) పురస్కరించుకొని గణిత శాస్త్రంపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించడానికి జ్యోతి ఐఐటీలో ఒలంపియాడ్ పరీక్ష నిర్వహించామన్నారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 2000కు పైగా విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.25,000తోపాటు 50మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.